క్లుప్తంగా

సోషల్ మీడియా కన్వీనర్‌గా మాదగోని నాగార్జున



నియామక పత్రం అందుకుంటున్న నాగార్జున

చండూరు : భారతీయ జనతా పార్టీ నల్లగొండ జిల్లా సోషల్ మీడియా కన్వీనర్‌గా చండూరు మండలం బంగారిగడ్డ గ్రామానికి చెందిన మాదగోని నాగార్జునను నియమిస్తూ బీజేపీ జిల్లా అధ్యక్షుడు కంకణాల శ్రీధర్‌రెడ్డి ఉత్తర్వులు జారీచేశారు. పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు.

కోలాట బృందానికి చీరల పంపిణీ



చీరలు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే వీరేశం

నకిరేకల్ : మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డులో 40 మంది కోలాటం బృంద సభ్యులకు ఆదివారం నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశం చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు వంటిపాక సోమలక్ష్మీ వెంకన్న, పన్నాల పావని శ్రీనివాస్‌రెడ్డి, చెవుగోని రజితశ్రీను, యాసారపు లక్ష్మీవెంకన్న తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ కిట్ అందజేత

నల్లగొండ రూరల్ : పట్టణంలోని మూడోవార్డ పాతపల్లెకు చెందిన క్రీడాకారులకు చింతపల్లి పరుశరాములు జ్ఞాపకార్థం ఆయన సతీమణి వజ్రమ్మ ఆదివారం క్రికెట్ కిట్ అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యశ్రీ, అయోధ్య, సాయి, బబ్లు తదితరులు పాల్గొన్నారు.

మహిళలపై విమర్శలు తగవు



మాట్లాడుతున్న నూనె వెంకటస్వామి

నకిరేకల్ : బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్, నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యలు మహిళలపై అసభ్యకరంగా మాట్లాడటం అత్యంత హేయమైన చర్య అని పీఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు నూనె వెంకటస్వామి అన్నారు. నకిరేకల్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగిన పీఆర్‌పీఎస్ నియోజకవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో నాయకులు కొండగూడురు సత్యనారాయణచారి, ఈదగాని కుమార్, దుర్గం జలందర్, కొండ నాగరాజు, రేకల సైదులు, గోలి భాస్కర్, మక్క చంద్రశేఖర్, కప్పల రాకేష్, పాల్గొన్నారు.

వైఎస్సార్‌టీపీ గెలుపునకు పాటుపడాలి

శాలిగౌరారం : రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో తుంగతుర్తి నియోజకవర్గంలో వైఎస్సార్‌టీపీ గెలుపు కోసం ప్రతి కార్యకర్త పాటుపడాలని వైఎస్సార్‌టీపీ మండల అధ్యక్షుడు కూటికంటి వెంకన్న అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పార్టీ కార్యకర్తల శ్రమ, వైఎస్సార్ అభిమానులు, ప్రజల ఆదరణలతో రానున్న ఎన్నికల్లో తుంగతుర్తి గడ్డపై వైఎస్సార్‌టీపీ జెండా ఎగరడం ఖాయమన్నారు.

ప్రజలను మభ్యపెట్టేందుకే గృహలక్ష్మి పథకం



మాట్లాడుతున్న దైద రవీందర్

నకిరేకల్ : ప్రజలను మభ్యపెట్టేందుకే గృహలక్ష్మీ పథకాన్ని బీఆర్‌ఎస్ ప్రభుత్వం తీసుకొస్తోందని కాంగ్రెస్ పార్టీ నాయకుడు దైద రవీందర్ అన్నారు. ఆదివారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇంటి స్థలం ఉన్నవారికి ఇంటి నిర్మాణం కోసం రూ.3 లక్షలు ఇస్తామని ప్రభుత్వం అంటోందని, పెరిగిన నిర్మాణ ధరలతో అవి ఎటూ చాలవని అన్నారు. మరి ఇంటి స్థలం లేని నిరుపేదల పరిస్థితి ఎంటి అని ప్రశ్నించారు. ఆయన వెంట గార్లపాటి రవీందర్‌రెడ్డి, యూసఫ్, అబ్దుల్ మజీద్, చెనగాని రాజశేఖర్, నర్సింగ్ మహేష్, వంటిపాక సతీష్, వెంకటేష్, నల్గొండ సాయి, దైద సురేష్, నవీన్, మాచర్ల నరేష్‌లు ఉన్నారు.

15 నుంచి క్రికెట్ టోర్నమెంట్

కనగల్ : నాగం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 15నుంచి కనగల్ క్రాస్ రోడ్డు వద్ద నాగం ప్రీమియర్ లీగ్ ఉమ్మడి నల్లగొండ జిల్లాస్థాయి క్రికెట్ పోటీలు నిర్వహించనున్నట్లు టోర్నమెంట్ నిర్వాహకులు పరుశురామ్, గడ్డం మహేష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలను నాగం ఫౌండేషన్ చైర్మన్ వర్షిత్‌రెడ్డి ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 13వ తేదీ వరకు టీం పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. వివరాల కోసం 6301907149, 9959193334 సెల్ నంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు.

అభివృద్ధిపథంలో మార్కెట్ యార్డు

- శాలిగౌరారం మార్కెట్‌కు రూ.56.50 లక్షలు మంజూరు
- అభివృద్ధి పనులకు శ్రీకారం
- సమకూరనున్న మౌలిక వసతులు



శాలిగౌరారం వ్యవసాయ మార్కెట్ కార్యాలయం

శాలిగౌరారం : మండల కేంద్రంలో ఉన్న వ్యవసాయ మార్కెట్ అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోంది. ఉమ్మడి రాష్ట్రంలో నకిరేకల్ వ్యవసాయ మార్కెట్ పరిధిలో సబ్ మార్కెట్‌గా ఉన్న శాలిగౌరారం వ్యవసాయ సబ్ మార్కెట్ అభివృద్ధి అంతంత మాత్రంగానే జరిగింది. 2014 తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు తర్వాత అభివృద్ధికి అడుగులు పడ్డాయి.

1977లో వ్యవసాయ సబ్ మార్కెట్ ఏర్పాటు

1969లో నకిరేకల్ వ్యవసాయ మార్కెట్ ఏర్పడింది. నకిరేకల్ వ్యవసాయ మార్కెట్ పరిధిలో శాలిగౌరారం వ్యవసాయ సబ్ మార్కెట్ యార్డును నాటి సమితిల కాలంలో 1977 మార్చి 2న ఏర్పాటు చేశారు. మండల కేంద్రంలోని సర్వే నంబర్ 490, 493లో 8.16 ఎకరాల విస్తీర్ణంలో వ్యవసాయ సబ్ మార్కెట్ ఏర్పాటు చేశారు. అనంతరం సబ్ మార్కెట్ యార్డు ఆవరణలో రెండు రూరల్ గోడౌన్లు, రైతు విశ్రాంతి గది మాత్రమే నిర్మించారు. ఆ తర్వాత ప్రహరీ నిర్మించారు.

2018లో ప్రత్యేక వ్యవసాయ మార్కెట్‌గా గుర్తింపు

నకిరేకల్ వ్యవసాయ మార్కెట్ పరిధిలో సబ్ మార్కెట్‌గా ఉన్న శాలిగౌరారం సబ్ మార్కెట్.. తెలంగాణ రాష్ట్రంలో తుంగతుర్తి ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ చొరవతో 2018లో నకిరేకల్ వ్యవసాయ మార్కెట్ నుంచి వీడి పూర్తి వ్యవసాయ మార్కెట్‌గా ఏర్పాటైంది. 2020లో తొలిసారిగా శాలిగౌరారం వ్యవసాయ మార్కెట్‌కు పాలకవర్గం ఏర్పాటైంది.

రూ. 56.50 లక్షలు మంజూరు

శాలిగౌరారం వ్యవసాయ మార్కెట్ అభివృద్ధికి స్థానిక ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ కృషితో రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల రూ. 56.50 లక్షల నిధులు మంజూరు చేసింది. ఈ నిధుల్లో రూ. 46 లక్షలతో వ్యవసాయ మార్కెట్ కార్యాలయం, రూ. 5.50 లక్షలతో దెబ్బతిన్నచోట ప్రహరీ నిర్మాణం, గోడౌన్ల పైకప్పు రిపేర్లు, రూ. 5 లక్షలతో తాగునీటి సౌకర్యం, ఇతరత్రా నిర్వహణ పనులు చేపట్టనున్నారు. ప్రస్తుతం వ్యవసాయ మార్కెట్‌లో కార్యాలయం లేకపోవడం వల్ల నాడు రైతుల విశ్రాంతి కోసం నిర్మించిన గదిలోనే కార్యాలయం కొనసాగిస్తున్నారు.

ఇప్పటివరకు రూ. 3.85 కోట్లు కేటాయింపు

సబ్ మార్కెట్ యార్డు ఆవిర్భావం నుంచి నేటివరకు శాలిగౌరారం వ్యవసాయ మార్కెట్ అభివృద్ధికి రూ. 3.85 కోట్లు నిధులు ఖర్చు చేశారు. అందులో 1988–89లో రూ.7.50 లక్షలతో రైతు విశ్రాంతి గది, రూరల్ గోడౌన్లు, ఇంటర్నల్ రోడ్లు, టాయిలెట్లు, ప్రహరీ నిర్మాణాలు చేపట్టారు. 1990–91లో రూ.1.83 లక్షలతో రెండు కవర్ షెడ్లు, ఓపెన్ ప్లాట్ ఫాంలను నిర్మించారు. 2007–08లో రూ. 2.70 లక్షలతో అంతర్గత సీసీ రోడ్లు నిర్మించారు. తెలంగాణ ఆవిర్భావం అనంతరం 2014–15లో కేంద్ర ప్రభుత్వ నిధులతో రూ.3 కోట్ల వ్యయంతో 5 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన నాబార్డు గోడౌన్లు నిర్మించారు. ప్రస్తుతం కార్యాలయ నిర్మాణం, మౌలిక వసతులు, కవర్ షెడ్ల రిపేరు కోసం రూ. 56.50 లక్షలు మంజూరయ్యాయి.

ఉత్తమ మార్కెట్‌గా తీర్చిదిద్దుతా



ఎమ్మెల్యే సహకారంతో వ్యవసాయ మార్కెట్‌ను పూర్తిస్థాయిలో అభివృద్ధి పరిచి జిల్లాలోనే ఉత్తమ వ్యవసాయ మార్కెట్‌గా తీర్చిదిద్దాలన్నదే నా ధ్యేయం. మార్కెట్‌లో యార్డులో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చేయడమే మా కర్తవ్యం.

– మామిడి తేజస్వి, శాలిగౌరారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్

రైతుల కష్టాలు తీరినట్టే



శాలిగౌరారం వ్యవసాయ మార్కెట్ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేయడం హర్షణీయం. మార్కెట్ అభివృద్ధి చెందితే ప్రతి సంవత్సరం రెండు పంట సీజన్‌లలో ధాన్యం కొనుగోలు గణనీయంగా జరుగుతుంది. రైతులకు ధాన్యం విక్రయాల కష్టాలు తీరినట్టే.

– చింత ధనుంజయ్య, రైతు, శాలిగౌరారం.

సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలి



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా ఇన్‌చార్జ్ ప్రదీప్‌కుమార్



హాజరైన పార్టీ నాయకులు

నల్లగొండ టూటౌన్ : కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి బీజేపీని బూత్ స్థాయిలో పటిష్టపర్చాలని బీజేపీ జిల్లా ఇన్‌చార్జ్ ఆర్. ప్రదీప్‌కుమార్ అన్నారు. ఆదివారం స్థానిక బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన నల్లగొండ నియోజకవర్గ బూత్ స్వశక్తికరణ్, శక్తి కేంద్రాల వర్క్‌షాపులో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రతి శక్తి కేంద్రం పరిధిలో స్వల్పకాలిక విస్తారకులను నియమించి పార్టీ బలోపేతానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యకర్తలు, నాయకులు సమన్వయంతో ముందుకు సాగాలని కోరారు. ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి మాదగోని శ్రీనివాస్‌గౌడ్, జిల్లా అధ్యక్షుడు కంకణాల శ్రీధర్‌రెడ్డి, సీనియర్ నాయకులు గోలి మధుసూదన్‌రెడ్డి, వీరెల్లి చంద్రశేఖర్, నూకల వెంకట్‌నారాయణరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి నిమ్మల రాజశేఖర్‌రెడ్డి, ఓరుగంటి రాములు, చింతా ముత్యాల్‌రావు, పోతెపాక సాంబయ్య, దాయం భూపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫీజుల పేరుతో విద్యార్థులను వేధించొద్దు



మాట్లాడుతున్న అయితగోని జనార్దన్‌గౌడ్

నల్లగొండ రూరల్ : ఫీజుల పేరిట విద్యార్థులను మానసిక వేదనకు గురి చేయొద్దని బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు అయితగోని జనార్దన్‌గౌడ్ అన్నారు. ఆదివారం స్థానిక సంఘం కార్యాలయంలో నిర్వహించిన విద్యార్థి సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్పొరేట్ విద్యాసంస్థల్లో విద్యార్థులను ఫీజుల కోసం వేధిస్తున్నారని ఆరోపించారు. ఫీజులు చెల్లిస్తేనే హాల్ టికెట్ ఇస్తామని విద్యార్థులను భయభ్రాంతులకు గురిచేయడం సరికాదన్నారు. విద్యార్థులు ఆత్మహత్య చేసుకుంటే అందుకు కళాశాలల యాజమాన్యాలే బాధ్యత వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు కర్నాటి యాదగిరి, కారింగు నరేష్, యాదగిరి, రామన్న, ప్రకాష్, శరత్, సందీప్, మల్లేష్, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

బండి సంజయ్‌పై పోలీసులకు ఫిర్యాదు



మర్రిగూడ : పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు



గట్టుప్పలలో బండి సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

చండూరు(గట్టుప్పల) : ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ అనుచిత వాఖ్యలకు నిరసనగా ఆయన దిష్టిబొమ్మను గట్టుప్పల మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో దహనం చేశారు. ఈ సందర్భంగా పలువురు నేతలు మాట్లాడుతూ బండి సంజయ్ వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు గౌరిగ సత్తయ్య, అంతంపేట ఎంపీటీసీ బంతిలాల్ నాయక్, మాజీ వైస్ ఎంపీపీ శ్రీనివాస్, గ్రామ శాఖ అధ్యక్షులు బండారి చంద్రయ్య, భీమనపల్లి సత్తయ్య, మండల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బండి సంజయ్ దిష్టిబొమ్మ దహనం

మర్రిగూడ : ఎమ్మెల్సీ కవితపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని బీఆర్‌ఎస్‌వీ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి సిలివేరు విష్ణు, దళితబంధు జిల్లా కమిటీ సభ్యుడు లపంగి నర్సింహ అన్నారు. ఈ సందర్భంగా వారు ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌పై ఫిర్యాదు చేశారు. అనంతరం మాట్లాడుతూ ఎమ్మెల్సీ కవితపై అనుచిత వ్యాఖ్యలను ఉపసంహరించుకుని బండి సంజయ్ క్షమాపణ చెప్పకపోతే బండి సంజయ్ ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల ఆర్గనైజింగ్ సెక్రటరి కొలుకులపల్లి యాదయ్య, చెరుకు శ్రీరాములుగౌడ్, పట్టణ ప్రధాన కార్యదర్శి వట్టికోటి శంకర్, అంబళ్ల రవిగౌడ్, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చిరుమర్తి దిష్టిబొమ్మ దహనం



నల్లగొండ : ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు



కట్టంగూర్ పీఎస్‌లో ఫిర్యాదు చేస్తున్న బీజేపీ నాయకులు



నకిరేకల్ : ఎమ్మెల్యే చిరుమర్తి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

నల్లగొండ టూ టౌన్ : బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని నిరసిస్తూ ఆదివారం బీజేపీ ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో నల్లగొండలో నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి పోతెపాక సాంబయ్య మాట్లాడుతూ చిరుమర్తి లింగయ్య చేసిన అనుచిత వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకొని బేషరతుగా బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అనంతరం టూటౌన్ పోలీస్ స్టేషన్లో చిరుమర్తి లింగయ్యపై ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు గోలి మధుసూదన్‌రెడ్డి, వీరెల్లి చంద్రశేఖర్, కన్మంతరెడ్డి శ్రీదేవిరెడ్డి, బీపంగి జగ్జీవన్‌రామ్, రావెళ్ల కాశమ్మ, నీరజ పాల్గొన్నారు.

నకిరేకల్ : బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌ని అసభ్య పదజాలంతో దూషించడాన్ని నిరసిస్తూ నకిరేకల్‌లో బీజేపీ నాయకులు ఆదివారం ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు కంకణాల శ్రీధర్‌రెడ్డి, చేపూరి రవీందర్ మాట్లాడుతూ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య క్షమాపణ చెప్పాలని, లేకుంటే ఆయనకు వ్యతిరేకంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. మెయిన్ సెంటర్‌లో ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న బీజేపీ నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం స్థానిక పోలీస్ స్టేషన్‌లో బీజేపీ నాయకులు ఫిర్యాదు చేశారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు పల్స శ్రీనుగౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు నకిరేకంటి మొగిలయ్య, ఐతగోని అనిత, మైల నర్సింహ, గోలి ప్రభాకర్, గుడుగుంట్ల సాయన్న, శివ కృష్ణ, పొట్టపల్లి నర్సింహ, కూరెళ్ల శ్రీను, రాచకొండ గోపి కొండేటి శ్రీను పాల్గొన్నారు.

చిరుమర్తిపై ఫిర్యాదు

కట్టంగూర్ : మహిళలపై అసభ్యంగా మాట్లాడిన నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ బీజేపీ మండల నాయకులు ఆదివారం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకులు మాట్లాడుతూ బీజేపీ నాయకుల భార్యలను అవమానపరిచేవిధంగా, మహిళల ఆత్మగౌరవాన్ని మంటగలిపే విధంగా మాట్లాడిన ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కోమటి భాస్కర్, పాదూరి వెంకట్‌రెడ్డి, నవీన్‌రెడ్డి, పలస సైదులు, నాగేష్ ఉన్నారు.

ముగిసిన విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు



బోనాలు తీసుకెళ్తున్న మహిళలు

కనగల్ : మండలంలోని జి.ఎడవెల్లి గ్రామపంచాయతీ పరిధి మదనాపురం గ్రామంలో మూడు రోజులుగా జరుగుతున్న బొడ్రాయి, ముత్యాలమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు ఆదివారం ముగిశాయి. చివరిరోజు గ్రామ మహిళలు డప్పుచప్పుళ్ల మధ్య బోనాలతో వచ్చి బొడ్రాయి, ముత్యాలమ్మ వద్ద నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు భారీ సంఖ్యలో హాజరై మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు కోయ సత్యనారాయణరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, ఇంద్రారెడ్డి, యన్న లింగారెడ్డి, సత్తిరెడ్డి, యన్న శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ లక్ష్మి, ఎన్‌బీఆర్ ఫౌండేషన్ చైర్మన్ సిద్ధార్థ

మాడుగులపల్లి : మండలంలోని పాములపాడు గ్రామంలో రూ.10 లక్షల పంచాయతీ అభివృద్ధి నిధులతో నిర్మించనున్న ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ఆదివారం సర్పంచ్ లక్ష్మీనరేందర్‌రెడ్డి, ఎన్‌బీఆర్ ఫౌండేషన్ చైర్మన్ నల్లమోతు సిద్ధార్థతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామాభివృద్ధికి పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. గ్రామాభివృద్ధికి అన్నివిధాలా అండగా ఉంటున్న ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఇటీవల మృతిచెందిన గ్రామస్తురాలు శేసగాని పార్వతమ్మ కుటుంబాన్ని పరామర్శించి రూ.5 వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ క్రమంలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు పాలుట్ల బాబయ్య, గ్రామశాఖ అధ్యక్షుడు చింతకాయల సైదులు, మాజీ సర్పంచ్ చింతచర్ల జానయ్య, అంబేద్కర్ యూత్ అధ్యక్షుడు నరేష్ పాల్గొన్నారు.

ఏప్రిల్ 5న 'చలో ఢిల్లీ'



మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

చండూరు : మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతాంగ, ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటించడానికి ఏప్రిల్ 5న చలో ఢిల్లీ నిర్వహిస్తున్నామని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చినపాక లక్ష్మీనారాయణ, రైతు సంఘం రాష్ట్ర నాయకుడు బండా శ్రీశైలం పిలుపునిచ్చారు. సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘాల చండూర్ మండల కమిటీల ఆధ్వర్యంలో స్థానిక మార్కెట్ యార్డులో నిర్వహించి సదస్సుకు వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. సీఐటీయూ మండల కన్వీనర్ మోగుదాల వెంకటేశం, కల్లుగీత కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి జెర్రిపోతుల ధనుంజయ్ గౌడ్, రైతు సంఘం నాయకులు నరసింహ, సీఐటీయూ నాయకులు వెంకన్న పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



అధ్యాపకుడిని సన్మానిస్తున్న మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి

నల్లగొండ టూ టౌన్ : నల్లగొండ పట్టణంలోని కాకతీయ డిగ్రీ కళాశాలలో 2007–10 విద్యా సంవత్సరంలో విద్యనభ్యసించిన విద్యార్థులు ఆదివారం కళాశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి విద్యా బోధన చేసిన అధ్యాపకులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థి, మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు చేయూత



చిట్యాల: ఆర్థికసాయం అందజేస్తున్న స్నేహితులు

నకిరేకల్ : మండలంలోని మంగళపల్లి గ్రామంలో బీఆర్‌ఎస్ జిల్లా నేత బచ్చుపల్లి గంగాధర్‌రావు పలువురికి ఆర్థికసాయం అందజేశారు. ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన కందికంటి రామచంద్రయ్య, అబ్బగోని సైదులు కుటుంబాలను పరామర్శించి రూ.10 వేల చొప్పున అందజేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న రావుల సైదమ్మకు, పిల్లల లలితకు రూ.5 వేలు చొప్పున అందజేశారు. వృద్ధులు సిద్దోజు సోమమ్మ, ఫైళ్ల పార్వతమ్మ, షేక్ బేగం, వట్టె లచ్చమ్మ, సిద్దోజు వెంకటరమణమ్మ, రూ.2వేల చొప్పున అందజేశారు. ఆయన వెంట సైదులు, లక్ష్మయ్య, అంజయ్య, వెంకన్న, నగేష్, పిచ్చయ్య, మున్నీర్, చిలుముల శ్రీను, తదితరులు ఉన్నారు.

ఆర్థికసాయం అందజేత

చిట్యాల : మండలంలోని చిన్నకాపర్తి గ్రామ వార్డు సభ్యుడు హెచ్చు స్వామి భార్య నిఖిత ఇటీవల మృతి చెందింది. దీంతో స్వామి కుటుంబాన్ని ఆదుకునేందుకు అతడితో కలిసి చదువుకున్న ఆ గ్రామ జెడ్పీహెచ్‌ఎస్ 2003–04 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు ముందుకు వచ్చారు. రూ.50 వేలు సేకరించి ఆదివారం స్వామి కూతురు చైత్ర పేరు మీద డిపాజిట్ చేసిన పత్రాలను అందజేశారు. అంతేకాకుండా ఆ గ్రామ ఉప సర్పంచ్ ఆవుల రమేష్ ఆధ్వర్యంలో వార్డు సభ్యులు రూ.20 వేల నగదును స్వామికి అందజేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు బోయపల్లి వెంకన్నగౌడ్, రుద్రారపు లక్ష్మణ్, మామిడి శంకర్, రుద్రారపు వెంకన్న, బాగం భద్రీనాథ్, తిరందాసు శేఖర్ పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



మహిళలను సన్మానిస్తున్న బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు సరిత

మిర్యాలగూడ టౌన్ : మహిళలు అన్ని రంగాల్లో రాణించినప్పుడే సమాజంలో ప్రత్యేక గుర్తింపు ఉంటుందని బీజేపీ రాష్ట్ర నేత సాధినేని శ్రీనివాస్‌రావు, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు కొండేటి సరిత అన్నారు. ఆదివారం పట్టణంలోని కేఎల్‌ఎన్ బాలిక జూనియర్ కళాశాలలో సరిత ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో భాగంగా షీటీం ఏఎస్ఐ తబిత, కానిస్టేబుల్ అదిలక్ష్మి, ఎంపీడీఓ కార్యాలయ సూపరింటెండెంట్ సత్యప్రభ, న్యాయవాది శ్రీదేవి, రిటైర్డ్ టీచర్ భాగ్యలక్ష్మి, లయన్స్ క్లబ్ మౌనిక, జనసేన జాతీయ కార్యదర్శి మాలతి, ఐటీ ర్యాంకర్ మౌనికలను శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రేపాల పురుషోత్తంరెడ్డి, అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బాణావత్ రతన్ సింగ్ నాయక్, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు సీతారాంరెడ్డి, బీసీ సెల్ పట్టణ అధ్యక్షుడు కొండేటి శేఖర్, మీడియా ఇనచార్జ్ రవికుమార్, మహిళా నాయకురాళ్లు రేణుక, యాదమ్మ, భాగ్యమ్మ, అరుణ, లక్ష్మి పాల్గొన్నారు.

మెరిట్ స్కాలర్‌షిప్‌లు అందజేత



స్కాలర్‌షిప్‌లు అందజేస్తున్న పూర్వ విద్యార్థి మాధవరెడ్డి

సంస్థాన్ నారాయణపురం : మండలంలోని సర్వేల్ గురుకుల విద్యాలయం పూర్వ విద్యార్థి ఎన్‌ఆర్ఐ మాదిరెడ్డి మాధవరెడ్డి ఆదివారం విద్యాలయంలో 10వ తరగతి మెరిట్ విద్యార్థులకు ఎంజీరెడ్డి మెమోరియల్ ట్రస్ట్ నుంచి మెరిట్ స్కాలర్‌షిప్‌లు అందజేశారు. జావ్లాకు రూ.25వేలు, చంటికి రూ.15వేలు, బాలచందర్‌కు రూ.10వేలుతో పాటు 7గురు విద్యార్థులకు రూ.1000 చొప్పున అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ గీతా, అధ్యాపకుడు దామోదర్, పూర్వ విద్యార్థులు మహేశ్వర్, బద్రీ, కళ్యాణ్, గోపి, శ్రీనివాస్, సతీష్, సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

సీపీఆర్‌పై అవగాహన ఉండాలి

మిర్యాలగూడ అర్బన్ : మారిన ఆహారపు అలవాట్లు, మనుషుల జీవన విధానంతో ఇటీవల గుండె జబ్బులు అధికంగా వస్తున్నాయని, గ్రామీణ వైద్యులు సీపీఆర్‌పై అవగాహన కలిగి ఉండాలని హైదరాబద్ కామినేని ఆస్పత్రి వైద్యులు డాక్టర్ ఎంఎ బేగ్ అన్నారు. ఆదివారం సుశ్రుత గ్రామీణ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో గ్రామీణ వైద్యులకు నిర్వహించిన సీపీఆర్‌పై అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గుండె సమస్యతో వ్యక్తి అపస్మారక స్థితిలో ఉన్న వ్యక్తికి సీపీఆర్ చేస్తే బతికే అవకాశం ఉంటుందని తెలిపారు. అనంతరం సీపీఆర్ చేసే విధానంపై డెమో ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సుశ్రుత గ్రామీణ వైద్యుల సంఘం మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బందనకంటి ద్రోణాచారి, మచ్చ లక్ష్మణ్, ఈసీ మెంబర్ మునీర్, హుస్సేన్, రవికుమార్ పాల్గొన్నారు.